క్లుప్తంగా

ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థికి ఆత్మీయ సన్మానం



ముసునూరు: నూజివీడు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు, ఏలూరు లోక్‌సభ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ తొలిసారిగా మండలానికి వచ్చిన సందర్భంగా స్థానిక నేతలు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముసునూరులో మంగళవారం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు తులిమెల్లి సుబ్బారావు అధ్యక్షతన మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, మాజీ సర్పంచ్ రేగుల గోపాలకృష్ణ నేత లిరువురినీ శాలువాలతో సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి, పార్టీ నేతలు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, నేతలు అనిల్, బాబూరావు, పంగిడయ్య, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం

చిలుకూరు(ఇబ్రహీంపట్నం): ఏసుక్రీస్తు శ్రమల దినాలు పురస్కరించుకుని చిలుకూరు ఆర్సీఎం చర్చి సంఘస్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో శిలువ మార్గం నిర్వహించారు. కంచికచర్ల విచారణ గురువులు దత్తు పేరం, కె.జోజి బాబు ఆధ్వర్యంలో దివ్యబలిపూజ చేశారు. ఏసుక్రీస్తు చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. భక్తులకు దివ్యప్రసాదం అందజేశారు. శిలువను భుజాన పెట్టుకుని వీధుల్లో శిలువమార్గం చేశారు. పూర్వం ఏసుక్రీస్తు పడిన శ్రమలను శిలువ మార్గం ద్వారా తెలియజేశారు. ఉపదేశి సత్యం, పెద్ద సంఖ్యలో భక్తులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

తిరువూరు: అమెచ్యూర్ రేడియో, విపత్తు నిర్మూలన వ్యవస్థపై స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విజయవాడ వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ ఆధ్వర్యంలో ఈసీఈ విద్యార్థులకు నిర్వహించిన సదస్సులో అసిస్టెంట్ వైర్‌లెస్ అడ్వయిజర్ ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ విపత్తు సమయంలో అమెచ్యూర్ రేడియోస్టేషన్లు ఫస్ట్ లైన్‌గా పనిచేస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, వైర్‌లెస్ మానిటరింగ్ స్టేషన్ అధికారులు శరత్‌బాబు, బంగారురాజు, బ్రిజేష్‌కుమార్, అభిషేక్‌కుమార్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల హర్షం

తిరువూరు: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో దీర్ఘకాలంగా కాంట్రాక్టు ప్రాతిపదికపై పనిచేస్తున్న తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసినందుకు తిరువూరు సబ్ డివిజన్ వైద్య ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏపీఎన్జీవో హోం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి రెగ్యులరైజ్ చేశారని తెలిపారు.

నేడు వైఎస్సార్ విగ్రహావిష్కరణ

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహావిష్కరణ గుంటుపల్లి అంబేడ్కర్‌నగర్ వద్ద బుధవారం సాయంత్రం జరుగుతుందని బొంతా సాంబశివరావు, కోసూరు వెంకటేష్ మంగళవారం తెలిపారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే కొడాలి నాని, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, నియోజకవర్గం ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు విగ్రహం ఆవిష్కరిస్తారు. వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభిస్తారనిపేర్కొన్నారు.

పోలీసు దళాల కవాతు

చాట్రాయి: రానున్న ఎన్నికల సందర్భంగా మండలంలో శాంతి భద్రతల దృష్టిలో పెట్టుకుని పోలీసుల కవాతు నిర్వహించినట్లు నూజివీడు సీఐ రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోనిపోలవరం, కోటపాడు గ్రామాల్లో పోలీసులు నిర్వహించిన కవాతులో ఆయన పాల్గొన్నారు. ఎస్సై స్వామి పాల్గొన్నారు.

● **ఇబ్రహీంపట్నం:** రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు భరోసా కల్పించేందుకు ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. విజయవాడ కొత్తపేట, ఇబ్రహీంపట్నం సీఐలు గణేష్, ఎం.సత్యన్నారాయణ, ఎస్ఐ అనూష, పోలీస్, పారామిలటరీ దళాలు పాల్గొన్నారు.

బలివేలో ఆదాయం రూ.41.50 లక్షలు

బలివే (ముసునూరు): బలివే రామలింగేశ్వర స్వామి ఆలయానికి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా రూ.41,50,360 ఆదాయం లభించినట్లు ఈవో సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారంఉత్సవాల అధికారి హరిప్రకాష్ ఆధ్వర్యంలో హుండీలు, ఇతర ఆదాయాల లెక్కింపు నిర్వహించారు. వివరాలను ఈవో వెల్లడించారు. ప్రత్యేక దర్శనాలు, శీఘ్ర దర్శనాలు, తొలి అభిషేకం, ప్రత్యేక అభిషేకాలు, విరాళాల ద్వారా రూ.12,38,489,తాత్కాలిక దుకాణాల ఏర్పాటుద్వారా రూ.13 లక్షలు, కొబ్బరి చిప్పల ద్వారా రూ.1,12,000, శాశ్వత, తాత్కాలిక హుండీలద్వారా రూ.14,47,371, లడ్డూ ప్రసాదం రూ.54,500, మొత్తం రూ.41, 50, 360 ఆదాయం లభించినట్లు తెలిపారు. ఈ ఏడాది రూ.ఏడు లక్షల అధిక ఆదాయం లభించింది. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి వైఎస్సార్ సీపీ చిరునామా

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



నూజివీడులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి

నూజివీడు: ప్రజా సంక్షేమానికి, పేదల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ పాటుపడుతోందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మేకా ప్రతాప్, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌తో కలిసి వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి నాయకులకు, ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించిన నాటి నుంచి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ఎన్నో పోరాటాలు చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తెచ్చుకోవాలన్నారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మద్దిరాల కోటమ్మ, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పెదగర్ల స్వరూపరాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కోటగిరి పూర్ణిమ పాల్గొన్నారు.

తిరువూరు: గతంలో ఏ ప్రభుత్వమూ చేపట్టని సంక్షేమ కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేసిందని తిరువూరు నియోజకవర్గ ఇన్ చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, ఎంపీపీ గద్దల భారతి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడుచలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, పీఏసీఎస్ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

జి.కొండూరు: పేదల సంక్షేమమే అజెండాగా ఆవిర్భవించిన వైఎస్సార్ సీపీ ఆ దిశగా విజయం సాధించిందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జి.కొండూరు పులివాగు పక్కన ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ పట్టణ అధ్యక్షుడు నెక్కలపు కుటుంబరావు అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ జెండాను ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్య రాణీ,శీరసాని ప్రకాష్, అనుమోలు శివబాజీ, ఓలేటి దుర్గారావు, శేషగిరి, ముత్యాలరావు, సత్యనారాయణరెడ్డి, డి.మల్లయ్య,తిరుపతిరావు పాల్గొన్నారు.

గంపలగూడెం: మండలంలో పార్టీ శ్రేణులు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి కేకు కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. తునికిపాడులో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. జిల్లా పరిషత్‌మాజీ చైర్మన్ ఎస్.సుధారాణి, పట్టణ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు కృష్ణారెడ్డి, నాయకులు గొర్ల రామిరెడ్డి, దోసపాటి గుర్నాధరరావు, ఇడుపులపాటి రాంబాబు, కోట కోటేశ్వరరావు,షేక్‌కరీం కోటలక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలను ఆగిరిపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు సాదం గోపి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు శేఖర్, సుభాని, నక్కనబోయిన పండు, అధ్యక్షుడు చిమట శ్రీను, అంజయ్య, నేరుసు రాజేష్, ఆదాం, బాషా పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కొండపల్లి బీకాలనీలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య అధ్యక్షతన పార్టీ జెండా ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. భట్టరాజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోరంకి పద్మావతి, ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసరాజు, షేక్ జానీషరీఫ్, సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. గాంధీ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు జోగి రాము, బొంత సాంబశివరావు ఎస్.శివశంకరరావు, కోమటి కోటేశ్వరరావు, పీఏసీఎస్ కార్యాలయం వద్ద సంఘం చైర్మన్ మునగాల శివారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లంకే అంకమోహనరావు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లంకే దేవకుమారి, కేక్ కట్‌చేసి జెండా ఆవిష్కరించారు. నాయకులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకల్లో నల్లగట్ల స్వామిదాసు, నాయకులు



జి.కొండూరులో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేకును కట్ చేస్తున్న నాయకులు



విస్సన్నపేటలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, పార్టీ నాయకులు



కొండపల్లి బీ కాలనీలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో శరభయ్య, నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు



తిరువూరు ఒకటో వార్డులో గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో స్వామిదాసు, నాయకులు

తిరువూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరు రాజుపేట ఒకటో వార్డులో మూడవ రోజు గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని, తిరువూరు పట్టణంలో సమస్యల పరిష్కారం తమ పార్టీతోనే సాధ్యమని స్వామిదాసు పేర్కొన్నారు. వార్డులోని సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలిసి వారికి అందిన పథకాల వివరాలు తెలుసుకున్నారు. రాజకీయాల కతీతంగా సంక్షేమపథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు కొలికపూడి నిర్మల, పసుపులేటి శేఖర్, పరసా శ్రీనివాసరావు, మోదుగ ప్రసాద్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు దుర్గారావు, రాజమహ్మద్, నడిం తిరువూరు పీఏసీఎస్ చైర్మన్ గజ్జల సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటూరు మస్తాన్, దేవిశెట్టి బాలకృష్ణ, కాలసాని నాగేశ్వరరావు, గత్తం నాగేశ్వరరావు, గోపాలరావు, వేణుబాబు, పింగళి గోపీ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ప్రశ్నాపత్రాలు

నూజివీడు: పదో తరగతి పరీక్షల ప్రశ్నాపత్రాలు మంగళవారం పట్టణ పోలీసు స్టేషన్ స్టాకు పాయింట్‌కు చేరాయి. ఈనెల 18 నుంచి 30 వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,177 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రశ్నాపత్రాల బండిళ్లను సరిచూసుకొని ట్రంకు పెట్టెలలో భద్రపరిచి పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్రిన్సిపాల్ వీవీఎన్ సత్యనారాయణ ప్రశ్నాపత్రాలను స్టాక్ పాయింట్‌లో భద్రపరిచే పనులను పర్యవేక్షించారు.

● **చాట్రాయి:** పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నా పత్రాల 1వ సెట్‌ని స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచినట్లు ఎంఈవో బ్రహ్మచారి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పది పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండవ సెట్ బుధవారం వస్తుందని ఆయన చెప్పారు.

● **గంపలగూడెం:** ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్ష సంబంధించిన మొదటి సెట్టు ప్రశ్నా పత్రాలు స్థానిక గంపలగూడెం పోలీస్ స్టేషన్‌కు చేరాయి. రూట్ ఆఫీసర్ నరసింహారావు ప్రశ్నాపత్రాలను తీసుకువచ్చి కస్టోడియన్ బి.కిరణ్‌కుమార్, జాయింట్ కస్టోడియన్ డి.చంద్రంలకు అందజేశారు. వాటిని ప్రత్యేక బాక్సులలో భద్రపరిచారు. మండల పరిధిలోని పరీక్షా కేంద్రాల సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు

మైలవరం: గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ తెనాలిలో గీతాంజలి అనే వివాహిత తనకు ఇంటి పట్టా రిజిస్ట్రేషన్‌తో సహా వచ్చిందని, ఇది ముఖ్యమంత్రి జగన్ చలువేనని ఆనందాన్ని తెలియజేస్తూ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చిందన్నారు. ఈ సారికూడా జగనన్నకే ఓటు వేస్తామని, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని తెలియజేసిందన్నారు. దీంతో టీడీపీ, జనసేనకు చెందిన సోషల్ మీడియా కార్యకర్తలు రెచ్చిపోయి ఆమెపై అసభ్యకరమైన ట్రోలింగ్‌లు పెట్టడంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి చర్యలను ఖండిస్తున్నామన్నారు.

విస్సన్నపేట: సోషల్‌మీడియాలో ట్రోలింగ్‌తో గీతాంజలిని మానసికంగా వేధించి ఆత్మహత్య చేసుకునేందుకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీ బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి.శివశంకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బీసీ సంఘం టౌన్ అధ్యక్షుడు బి.మాహేశ్వరరావు ఆధ్వర్యంలో గీతాంజలి మృతి పట్ల మంగళవారం నివాళులర్పించారు. ఆమె మృతికి కారకులైన వారిని శిక్షించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంకట్, వెంకటరమణ, తిరుపతిరావు, విక్రమ్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



గీతాంజలి మృతికి కారకులైన వారినిశిక్షించాలని కోరుతున్న బీసీ సంఘం నాయకులు



తిరువూరులో కొవ్వొత్తుల ర్యాలీలో బీసీ, ఎస్సీ సంఘాల

తిరువూరు: తెలుగుదేశం సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగులతో వేధించడంతో బలవన్మరణం చెందిన గీతాంజలి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ తిరువూరులో వైఎస్సార్ సీపీ ఎస్సీ, బీసీ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ విభాగాల నాయకులు పరసా శ్రీనివాసరావు, మాయిరి వెంకట రమణ, తిరుమలశెట్టి వేణు, మోదుగు ప్రసాద్, మూడు దుర్గారావు, పరసా సత్యనారాయణ, షేక్ జాకీర్, కాలసాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఆర్‌యూఎస్ఏ పథకానికి డిగ్రీ కాలేజీ ఎంపిక

మైలవరం: ప్రధాన మంత్రి ఉన్నత విద్య పథకానికి మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. కళాశాలలో రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (ఆర్‌యూఎస్ఏ) పథకానికి ఎంపికై ఒదని, ఈ పథకం కింద రాబోయే మూడు సంవత్సరాలలో కళాశాల అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయిస్తారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కళాశాలలు ఎంపిక కాగా ఎన్టీఆర్ జిల్లా నుంచి మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎంపిక కావడం విశేషమన్నారు. జాతీయ విద్యా విధానం-2020ని అనుసరించి ఉన్నత విద్యా సంస్థలలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ, నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, శాస్త్ర సాంకేతికతను జోడించి విద్యాబోధన, ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని ఈ పథకం అందిస్తుందన్నారు. కళాశాల విద్యా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ ప్రోద్బలం, సహకారంతో ఈ పథకానికి కళాశాల దరఖాస్తు చేసుకుందన్నారు.

దేవస్థానం చైర్మన్‌గా రామకృష్ణ

మేడూరు(గంపలగూడెం): ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గంపలగూడెం మండలం మేడూరు శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడుగా ముత్యాల రామకృష్ణ మంగళవారం పదవి స్వీకారం చేశారు. ఎండోమెంట్ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఏడుగురు పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యుల సమావేశంలో ముత్యాల రామకృష్ణను అధ్యక్షుడిగా నల్లగట్ల రామకృష్ణ ప్రతిపాదించగా, కే సీత బలపరిచారు. దీంతో రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. పాలకవర్గ సభ్యులుగా కురుమిల్లి సీత, నాగోలు రామకృష్ణ, నల్లగట్ల రామకృష్ణ, గుండ్ల భాగ్యమ్మ, మలిశెట్టి పద్మావతి, వేముల పార్వతి, ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఆలయ ప్రధాన అర్చకులు రామచంద్రచార్యులు నియమితులయ్యారు. వీరిచే గన్నవరం ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పదవీ ప్రమాణం చేయించారు. ఆలయ మేనేజర్ జే వెంకటేశ్వర్లు, సొసైటి అధ్యక్షుడు బరిగెల రామరావు, ఆలయ మాజీ అర్చకులు కొమండూరి రామచంద్రచార్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ప్రాధాన్యం ఇవ్వాలి

ముసునూరు: దివ్యాంగ బాలలకు అన్నింటా ప్రాధాన్యం కల్పించాలని స్టేట్ అసిస్టెంట్ ఐ.ఈ సమన్వయకర్త రాధిక అన్నారు. మంగళవారం సమగ్ర శిక్షా అభియాన్ ముసునూరు మండల విభాగం ఆధ్వర్యంలో రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో దివ్యాంగ బాలలకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బాలల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఫిజియోథెరపిస్ట్ జి.ప్రశాంతి దివ్యాంగ బాలలకు ఫిజియోథెరపీ అభ్యసనాలు చేయించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్.ఎం రామకృష్ణారావు, స్థానిక హెచ్.ఎం లోకరాజు, ఐఈఆర్ టీచర్ ఎం.వి లక్ష్మీ నారాయణరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ

తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): మండలంలోని తుమ్మలపాలెంలో జగనన్న కాలనీలో స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. నియోజకవర్గం ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు మహిళలకు పట్టాలు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు, ఇళ్లు మంజూరు చేయడంతో పాటు రిజిస్ట్రేషన్ చేసి స్థలాలపై సొంత హక్కు కల్పించారన్నారు. పేదలకు అండగా నిలిచిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ నాయకులు జోగి రాము, మేడపాటి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ

చాట్రాయి: మండలంలోని పోలవరం గ్రామానికి చెందిన కంకోల సుబ్బరాజు 2022లో ఆరోగ్యశ్రీ పథకంలో మెదడుకు సంబంధించిన ఆపరేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులకే పక్షవాతం రావడంలో కుడి కాలు, కుడి చెయ్యి పనిచేయడం లేదు. కుటుంబాన్ని పోషించాల్సిన పెద్ద దిక్కు మంచానికి పరిమితమవ్వడంలో కుటుంబ పోషణ భారమైంది. దాతలు చిన్నంపేట సిద్ధార్థ హైస్కూలు ప్రిన్సిపాల్ పలగాని శ్రీనివాసరావు, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కొమ్ము ఆనందం బుడుపుల రామకృష్ణ, కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నెలకు సరిపడ రూ.10 వేల విలువైన నిత్యావసర సరుకులు, నగదును బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. బాధితుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

గంపలగూడెం: ఎన్టీఆర్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు బంక రాంబాబు నియమితులయ్యారు. ఈ విషయమై జిల్లా అసోసియేషన్ ప్రతినిధుల నుంచి రాంబాబు మంగళవారం ఉత్తర్వులు అందుకున్నారు. విద్యార్థులకు క్రీడలలో మెరుగైన శిక్షణ ఇచ్చినందుకు గుర్తింపుగా ఎంపిక చేశారు. తన పదవీకాలంలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి, విద్యార్థుల, వ్యాయామ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాంబాబు తెలిపారు.

కాలినడకన భద్రాచలం

చాట్రాయి: మర్లపాలెం గ్రామానికి చెందిన 60 మంది రామ భక్తులు మంగళవారం తెల్లవారుజామున కాలి నడకన భద్రాచలం రామాలయానికి బయలుదేరి వెళ్లారు. మొక్కు తీర్చుకునేందుకు వెళ్తున్నట్లు భక్తులు చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఏ.వీరరాజు తెలిపారు. ఏప్రిల్ 21వ తేదీన మద్దులపర్వ మోడల్ స్కూలులో పరీక్ష నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఈనెల 31వ తేదీ లోపు పరీక్ష రుసుం చెల్లించాలన్నారు. ప్రవేశాల కొరకు 70757 73456, 82475 52027 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు 96 మంది గైర్హాజరు

నూజివీడు: పట్టణంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఫస్ట్ ఇంటర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల పరీక్షకు 96 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మదుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్దార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవగా, 8.30 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. ఈ పరీక్షకు పట్టణంలోని ఐదు కేంద్రాల్లో కలిపి 1,739 మంది విద్యార్థులకు 1,643 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 96 మంది గైర్హాజరయ్యారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతిరోజు కొద్దిపాటి వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులు దరిచేరవని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.శంకర్‌గుప్తా అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మెగా వైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. పలు టెస్ట్‌లు చేశారు. కార్మికులతో పాటు కట్టుబడిపాలెం, శాంతినగర్‌కు చెందిన 300 మంది చికిత్స పొందారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి, డిస్ట్రిక్ చైర్‌పర్సన్ బి.కృష్ణారెడ్డి, సభ్యులు బుల్లిరాజు చౌదరి, వెంకటేశ్వరరావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

రెడ్డిగూడెం: మండలంలోని కూనపరాజుపర్వ గ్రామంలో ఇళ్ల పట్టాలను మంగళవారం సర్పంచి మాతంగి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన పేదలకు నివేశన స్థలాలు ఇచ్చారన్నారు. రిజిస్ట్రేషన్ చేసి పట్టాలు ఇస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. ఉప సర్పంచ్ తోటకూర రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

చాట్రాయి: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని జిల్లా విద్యా శాఖాధికారి కె.అబ్రహం సూచించారు. మంగళవారం మర్లపాలెం ప్రాథమిక పాఠశాల, ఉప్పర్ల కాలనీ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్‌లు, నోట్ బుక్‌లు సిలబస్, ఎఫ్ఏ- 4 పరీక్షల మూల్యాంకనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీవైఈవో సేవియా నాయక్, ఎంఈవో బ్రహ్మచారి పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

రెడ్డిగూడెం: అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను యూటీఎఫ్ రెడ్డిగూడెం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూలులోనిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పటాపంచల భవానీ మాట్లాడు తూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని పేర్కొన్నారు. యూటీ ఎఫ్ మండల కార్యదర్శి పి.సుబ్రహ్మణ్యం, గౌరవ అధ్యక్షుడు డి.ప్రకాష్, కోశాధికారి కే రవిబాబు, సహా అధ్యక్షులు విజయలక్ష్మి, హర్షవర్ధని, అరుణ పాల్గొన్నారు.